క్లుప్తంగా

ప్రత్యేకావసరాలు గల చిన్నారులను గుర్తించాలి



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రత్యేక అవసరాలుగల చిన్నారులను గుర్తించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలని భవిత సెంటర్ ఉపాధ్యాయులు లీలావతి, శివపార్వతి సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణనిచ్చారు. దివ్యాంగుల స్క్రీనింగ్, చేరిక, వ్యూహాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో చక్కటి ఆరోగ్యం



వత్సవాయి: పౌష్టికాహారంతోనే వ్యాధులు దరిచేరకుండా చక్కటి ఆరోగ్యాన్ని పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి పేర్కొన్నారు. వత్సవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ భీ పఢాయి భీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం ఎంతో ఆరోగ్యకరమన్నారు. అంతటి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి అర్షిదాబేగం, తహసీల్దార్ ప్రభుకుమార్, ఎంఈవో ఎల్.నాగరాజు, ఎంపీడీవో ఎస్ రాంబాబు, సూపర్‌వైజర్లు బీబీజాన్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..



చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని మహిళా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న పోషణ భి పఢాయి బీ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా సీడీపీవో లక్ష్మీభార్గవి మాట్లాడుతూ అంగనవాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. నవచేతన, ఆదర్శాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నాగమణి, సూపర్‌వైజర్ రజనీ జ్వాలా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

కంచికచర్ల: కంచికచర్ల గ్రామదేవతగా విరాజిల్లుతున్న మహాలక్ష్మి అమ్మవారు ఆలయంలో మాఘ మాసంలో అమ్మవారు ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు కాకాని హనుమత్ సుమన్‌శర్మ శనివారం తెలిపారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి వార్షిక బోనాలు సమర్పిస్తామన్నారు. అమ్మవారికి ఆదివారం పంచామృత ద్రవ్యాలతో అభిషేకాలు, సోమవారం వార్షిక బోనాలు సమర్పణ, మంగళవారం మల్లెపూలతో చీర అలంకరణ, బుధవారం ఉయ్యాల సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ నిర్వహించే లలిత పారాయణం, కుంకుమార్చన పూజలు, మహన్యాసపూర్వక అభిషేకాలు, అష్టోత్తర పూజలు, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

లలితా సహస్ర నామ పారాయణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం లలితా సహస్ర నామ పారాయణ, శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం, అమ్మవారి నామ పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ వారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో హైదరాబాద్‌కు చెందిన సులోచన ఫౌండేషన్ ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పారాయణంలో సుమారు 350 మందికి పైగా మహిళలు పాల్గొని ఏక కంఠంతో పారాయణం చేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు శైలజ పర్యవేక్షణలో పారాయణం సుమారు మూడు గంటల పాటు సాగింది. అనంతరం పారాయణంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందించారు.

పల్లెకు రాని వెలుగు



ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు

- ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రజలు..
- దినదినగండంగా ప్రయాణం
- ఇబ్బందుల్లో విద్యార్థులు, ప్రజలు

నందిగామరూరల్: పేరుకు పల్లెవెలుగు.. పల్లెల్లో మాత్రం కనిపించదు..ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, సుఖవంతం..ఆర్టీసీలో ప్రయాణించండి గమ్యస్థానానికి చేరుకోండి..అంటూ బస్సుల్లో ప్రకటనలు మినహా ఆచరణలో ఆర్టీసీ బస్సులు మారుమూల గ్రామాలకు నడవడం లేదు. దీంతో విద్యార్థులు, ప్రజలు ఆటోలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ఆటోల్లో ప్రమాదపుటంచున ప్రయాణాలు సాగిస్తున్నారు.

నేటికీ ప్రజలకు తప్పని నడక..

మండలంలోని లింగాలపాడు, తక్కెళ్లపాడు, లచ్చపాలెం, కంచల, కమ్మవారిపాలెం, రాఘవాపురం, తొర్రగుడిపాడు, కొణతమాత్మకూరు, గోళ్లమూడి, రుద్రవరం, సోమవరం, దాములూరు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. అడవిరావులపాడు, కొండూరు, మునగచర్ల గ్రామాలకు మాత్రం కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఆర్టీసీ బస్సు దిగి గ్రామాల్లోకి నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పల్లగిరి, మాగల్లు, రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ గ్రామాలకు సైతం తెలంగాణ ఆర్టీసీ బస్సు ఉదయం ఒక సర్వీసు, సాయంత్రం సమయంలో ఒక సర్వీసు నడుస్తోంది.

15గ్రామాలకు బస్సు సౌకర్య నిల్...

ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఏర్పాటు ముఖ్య ఉద్దేశం గ్రామీణ ప్రాంతాలకు బస్సు సదుపాయం కల్పించడమే. అయితే ఆచరణలో మాత్రం పల్లెలకు బస్సులు వెళ్లడం లేదు. నందిగామ మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉండగా, 15 గ్రామాలకు బస్సు సదుపాయం లేదు. మండల ప్రజలు ఆయా పనులపై నిత్యం నందిగామకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సు సదుపాయం లేకపోవడంతో వీరంతా తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులను కోరినా ఫలితం లేకపోయిందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల నుంచి నందిగామలోని విద్యా సంస్థలకు వచ్చే విద్యార్థులు సైతం ఆటోలనే ఆశ్రయించాల్సి వస్తుందని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ప్రమాదకరంగా ఆటో ప్రయాణం..

నందిగామ మండలంలోని మెజార్టీ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోల్లో ప్రమాదకరస్థితిలో ప్రయాణాలు సాగించాల్సి వస్తుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో తప్పనిసరై ఆటోలను ఆశ్రయిస్తున్నామని కనీసం 15మంది ఎక్కనిదే ఆటోలు కూడా కదలడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. బస్సులు లేకపోవడాన్ని ఆసరాగా తీసుకుని పలువురు ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తుండటమే కాకుండా ఇష్టారాజ్యంగా చార్జీలు వసూలు చేస్తుండటం గమనార్హం. కిక్కిరిసిన ప్రయాణికుల మధ్య అంతంతమాత్రంగా ఉన్న రహదారులపై ప్రజలు ప్రాణాలను అరచేత పట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి నందిగామ మండలంలోని ఆయా గ్రామాలకు పల్లెవెలుగు బస్సులను నడపాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నందిగామ నుంచి గ్రామాలకు ప్రజలను చేరవేసేందుకు స్టాండ్‌లో ఉన్న ఆటోలు

బస్సు సౌకర్యం కల్పించాలి..



మాకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో ఎక్కడికైనా వెళ్లాలంటే ద్విచక్ర వాహనాలు, ఆటోలనే ఆశ్రయించాల్సి వస్తోంది. విద్యార్థులు కీసర టోల్‌ప్లాజా సమీపంలోని జాతీయ రహదారి వద్దకు చేరుకుని అక్కడి నుంచి బస్సులో విద్యాసంస్థలకు వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

– రామిరెడ్డి సీతయ్య, కంచల

ఆటోల్లోనే వెళ్తున్నాం..



ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో ఆటోలను ఎక్కుతున్నాం. ఆటోల్లో కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. రహదారులు కూడా సరిగా లేకపోవడంతో ఆటో ప్రయాణం దినదినగండంగా మారింది. అధికారులు స్పందించి బస్సు సదుపాయం కల్పించాలి.

–వేల్పుల కిషోర్, కమ్మవారిపాలెం

మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్ కూటమి ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు

గౌరవరం(జగ్గయ్యపేట): మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్‌గా కూటమి ప్రభుత్వం నిలిచిపోయిందని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ గౌరవరం గ్రామపార్టీ కన్వీనర్‌గా ఎన్నికైన ఆదూరి కిషోర్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇళ్లకే వచ్చాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క హామీ అమలుచేయకపోగా ఉన్న వాటిని కూడా అనర్హులుగా తొలగిస్తున్నారన్నారు. గ్రామ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, సొసైటీ మాజీ అధ్యక్షుడు అన్నాబత్తుల శ్రీనివాసరావు, ఎంపీపీ సంఘ అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గూడపాటి శేషగిరి, మండల, పట్టణ కన్వీనర్‌లు బూడిద నరసింహారావు, వట్టెం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మక్కపేట(వత్సవాయి): గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో శనివారం డెమొక్రటిక్ పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డీపీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ముక్కా సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి యండ్రాతి మల్లేశ్వరరావు, జిల్లా ప్రధానకార్యదర్శి మర్రి ప్రభాకర్ అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. డీపీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా రెమిడాల నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శిగా జక్కా రవీంద్రనాథ్, కోశాధికారిగా కె.శ్రీకాంత్, మహిళాఅధ్యక్షురాలిగా చిట్టిపోతుల కరుణ ఎన్నికయ్యారు. అనంతరం వారు పదవీ ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ముక్కా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గాలు చూపడంలో డీపీఆర్టీయూ చురుకైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. మండలంలో అతి తక్కువ కాలంలోనే యూనియన్ బలపడిందని వివరించారు. కార్యక్రమంలో ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జాన్, బీహెచ్ మోంగ్యా, బి.పూర్ణయ్య, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లతో సమీక్ష



చిల్లకల్లు(జగ్గయ్యపేట): సూర్యఘర్ పథకానికి సంబంధించి బ్యాంకుల్లో లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను తిరస్కరించొద్దని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సంయుక్త మండలస్థాయి బ్యాంకర్ల సమితి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూర్యఘర్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయన్నారు. బ్యాంకర్‌లు దరఖాస్తులను తిరస్కరిస్తే, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ప్రియాంక, యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ అధికారి శివాజీ, విద్యుత్‌శాఖ ఏఈ రామకృష్ణ, ఆయా బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసంత్ సేవాలాల్ ఆశయాలు అందరికీ ఆదర్శం



సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, బంజారా నాయకులు



పూజలు నిర్వహిస్తున్న గోర్ భాయ్ సేవా సంఘ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయాలు ఆదివాసీలు, గిరిజనులకే కాకుండా అందరికీ ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆపార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి లాహోరి బద్దూనాయక్ ఆధ్వర్యంలో బంజారా సోదరుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సంత్‌సేవాలాల్ చిత్రపటానికి తన్నీరుతోపాటు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని గిరిజన సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆదివాసులను సంస్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన సంత్ సేవాలాల్ మార్గం భావితరాలకు స్ఫూర్తిదాయమన్నారు. ఆయన జయంతికి అధికారిక సెలవుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి బద్దూనాయక్ మాట్లాడుతూ బంజారాల కమ్యూనిటీ భవనం కోసం తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థలం ఏర్పాటు చేస్తే తమకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఆదిశగా సహకరించాలని కోరారు. అనంతరం గౌర్‌బాయ్ సేవాసంఘం వారి ఆధ్వర్యంలో ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, జిల్లా కార్యదర్శులు రూప్లానాయక్, వేముల మల్లేశ్వరరావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, పట్టణ యూత్ అధ్యక్షుడు రామిని ఉపేందర్‌రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు షేక్ మునీరాబేగం, పట్టణ కార్మిక, ప్రచార, వాలంటరీ, మున్సిపల్, క్రిస్టియన్ మైనార్టీ విభాగాల అధ్యక్షులు గంగోలు వినోద్, గోగుల వెంకయ్య, ఇమ్రాన్‌పాషా, అన్నెపాగ మురళి, దారెల్లి మహేష్, పట్టణ యూత్ ప్రధానకార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, బలుసుపాడు సర్పంచ్ సూరిబాబు, తిరుమలగిరి దేవస్థానం డైరెక్టర్ దర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్సీసెల్ నాయకుడు శామ్యూల్ కన్నమాల, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహరెడ్డి, లాహోరి బాలమ్మ, సంపత హుస్సేన్, బంజారా నాయకులు పాల్గొన్నారు.

గోర్‌భాయ్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని గోర్‌భాయ్ సేవాసంఘ్ ఆధ్వర్యంలో శనివారం సుగాలీల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లాహోరి తులిశ్యానాయక్, సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు లాహోరి బద్దూనాయక్, భూక్యా బద్యానాయక్, సంఘ అసిస్టెంట్ సెక్రటరీ రమావత్ శ్రీనివాసనాయక్, ఏఈవో డి.రవీందర్‌నాయక్, గోర్‌బాయ్ సేవా సంఘ ప్రతినిధులు భూక్యా కృష్ణనాయక్, లాహోరి ప్రేమనాధనాయక్, మోహన్‌ధార్యా, ఆడోతు బ్రహ్మం, ఆజ్మీర కొండ పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే తాతయ్య..

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తన నివాసంలో సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బంజారా గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లాహోరి కుసుమలత, గుగులోతు హుస్సేన్, ఇస్లావత్ శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కంచికచర్ల: క్రీడలతో శారీరక ఆరోగ్యంతోపాటు మానసికొల్లాసం కలుగుతుందని ఎస్ఐ బి.రాజు అన్నారు. స్థానిక చైతన్య టెక్నో స్కూల్‌లో ప్రీస్కూల్ స్టార్ కిడ్స్ విభాగంలో బాల్‌పాస్సింగ్, లెమన్ స్పూన్, హడిల్ జంపింగ్ తదితర పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ఎస్ఐ బహుమతులు అందజేసి అభినందించారు. ఎస్ఐ మాట్లాడుతూ బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి స్పోర్ట్స్ మీట్‌లు దోహదపడతాయన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ చిన్నారులకు ఆయా క్రీడల్లోనూ తర్ఫీదు ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సాఫ్ట్ స్కిల్స్ టీచర్ ఉమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



హెచ్‌ఎం జలజకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న మహేశ్వరరావు, పక్కన ఉపాధ్యాయులు

పెనుగంచిప్రోలు: టెన్త్ విద్యార్థుల కోసం డెమోక్రటిక్ పీఆర్టీయూ అందించిన స్టడీ మెటీరియల్‌ను సమగ్రశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.జలజకు అందజేశారు. విద్యార్థులకు పంపిణీ చేయాలని కోరారు. ఈసందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సమస్యల కోసం పోరాడటమే కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా పీఆర్టీయూ ముందంజలో ఉండటం సంతోషకరమన్నారు. పీఆర్టీయూ జిల్లా నాయకులు ముక్కా సత్యనారాయణ, మర్రి రాజశేఖర్, రాము మాట్లాడుతూ తమ యూనియన్ తరుపున భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడామని వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటరావు, నరేష్, పుల్లయ్య, వేగినేటి రమణ,బయ్యారపు సుబ్బారావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కంచికచర్లలో ఇంకుడి గుంత స్థలాన్ని పరిశీలిస్తున్న డీటీ మానస, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు



నందిగామలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణబాబు

కంచికచర్ల : స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కంచికచర్లలో పరిసరాల పరిశుభ్రతపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది రోడ్డుపై మానవహారం ఏర్పాటు చేసి పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ వేమూరి మానస మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రం చేయడంతోపాటు డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదల అయ్యేలా తగుచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి బొజ్జాని శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్, పంచాయతీరాజ్ ఏఈ టీవీ రవికుమార్, ఏపీఓ రమాదేవి, ఆయాశాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయా గ్రామాల్లో...

మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గండేపల్లిలో సర్పంచి బొక్కా రవికుమార్, కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పరిటాలలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, చెవిటికల్లులో సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, కొత్తపేటలో పత్తిపాటి సునీత, కీసరలో పేరం నర్సమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, నానిబాబు, సోమిరాజు, ఫణీంద్రనాయక్, వనిత, రాజ్యలక్ష్మి, అనిత, రాంజీ, అబ్దుల్‌నజీర్, ఏఎస్ఎంలు, వీఆర్వోలు, అంగనవాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో...

నందిగామటౌన్(నందిగామరూరల్): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అందుకు ప్రజలు కూడా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు కోరారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యకరమంలో భాగంగా శనివారం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతన్నారు. పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సోర్స్-రీసోర్స్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో వారి ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులతో ఉపయోగపడే వస్తువుల తయారీపై ప్రత్యేక ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబర్చిన 13 మంది విద్యార్థులకు కమిషనర్ బహుమతులు అందజేశారు. పట్టణంలోని నారాయణ ఆంగ్లో వేదిక్ పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి 12మందికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, మున్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి




కంచికచర్ల: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు అందాలంటే రైతులంతా తప్పనిసరిగా విశిష్ట సంఖ్య(ఫార్మర్ ఐడీ) కలిగి ఉండాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారిణి డీఎంఎఫ్ విజయకుమారి స్పష్టం చేశారు. మండలంలోని పరిటాల రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ల ప్రక్రియను శనివారం ఆమె తనిఖీ చేశారు. రైతుల పంటఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఏడీఏ ఐకె శ్రీనివాస్, ఏఓ కె.విజయకుమార్, వ్యవసాయ సహాయకులు దుర్గ, చంద్రశేఖర్, రఘు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ రూరల్: మండలంలోని ఐతవరం, అంబారుపేట గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో ఏపీఎఫ్ఆర్ పోర్టల్ ద్వారా చేపడుతున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి శనివారం ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఆమె వెంట ఏడీఏ శ్రీనివాస్, ఏవో ఖాశీం, వీఏఏలు ఉన్నారు.

ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని కృష్ణానది సమీపంలో నిర్మిస్తున్న వేదాద్రి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను పేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శనివారం పరిశీలించారు. నది నుంచి పైపులైన్లు వెళ్లే ప్రాంతాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ మన్నెం నారాయణరావు, సర్పంచ్ గుడారు పేరయ్య, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు తేనేటి విందు



గండ్రాయిలో పంచాయతీ కార్మికులకు తేనేటి విందు ఇస్తున్న అధికారులు



పేటలో తడిపొడి చెత్త వేరుచేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న శానిటేషన్ అధికారులు

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం తడిపొడి చెత్తపై పంచాయతీ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం షెడ్డులో పంచాయతీ కార్మికులకు తేనేటి విందు ఇచ్చారు. ఈసందర్భంగా భూచవరం వైద్యాధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. చిల్లకల్లు, గౌరవరం గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు.

కంపోస్టు తయారీపై అవగాహన..

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలో శనివారం మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రులు, మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని తడిపొడి చెత్తను వేరుచేసే విధానంపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కంపోస్టు తయారీని వివరించారు. అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

నందిగామ టౌన్(నందిగామ రూరల్): పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు చేశారు. ఆలయ ఈవో గంగాధర్, ఆలయ అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి మురళీ రాఘవకుమార్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.